
ఆంధ్రజ్యోతి

కాకినాడ
జిల్లా వార్తలు
ఆదివారం 7 సెప్టెంబరు 2025 | 5

బై.. బై.. గణేశా!


కాకినాడ సాగరతీరంలో భారీ గణనాథుడి విగ్రహం ఊరేగింపు


రత్నగిరిపై కొలువుతీరిన గణనాథుడిని పంపాసరోవరంలో క్రేన్ సహాయంతో నిమజ్జనం గావిస్తున్న పండితులు


పిఠాపురంలో నిమజ్జనానికి గణనాథుడిని తరలిస్తున్న చిన్నారులు


ప్రత్తిపాడులో వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌పై తీసుకెళ్తున్న దృశ్యం

గణపతి బొప్పా మోరియా అంటూ.. యువకులు ఉత్సాహంతో వినాయకులను సాగనంపారు. గణపతి నవరాత్రులు ముగియడంతో జిల్లాలో భారీగా వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. భారీ ఊరేగింపుల నడుమ వినాయక మండపాల నిర్వాహకుల నృత్యాలు, యువత సందడితో శనివారం రోడ్లు హోరెత్తాయి. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో గోదావరితోపాటు సముద్రాల్లోను, స్థానిక కాలువల్లోను వినాయక విగ్రహాల నిమజ్జనాలు చేపట్టి గణనాథులకు వీడ్కోలు పలికారు.


కాకినాడ-రాజమహేంద్రవరం గోదావరి కాలువ

గోదారయ్..రయ్!

ఉమ్మడి జిల్లాలో గోదావరి కాలువలపై సరుకు రవాణా

ఒకనాడు రోడ్డు మార్గాలు.. ఆకాశ మార్గాలు ఉండేవి కావు.. కేవలం జల రవాణా లేదంటే నడక.. అందుకే నేటికీ చెబుతుంటారు.. మా తాతలు కాలవల ద్వారా ప్రయాణించేవారని.. అదంతా బ్రిటిష్ వారి కాలంలో మాట.. నేటికీ ఆయా గురుతులు నిడదవోలు, వేమగిరి తదితర ప్రాంతాల్లో ఉన్నాయి.. మళ్లీ ఆ రోజులు రాబోతున్నాయి.. జల రవాణాను మళ్లీ అందుబాటులోకి తేనున్నారు..ఈ మేరకు గోదావరిలో పది మార్గాలను గుర్తించారు.. ఆయా మార్గాల అభివృద్ధికి టెండర్లు పిలిచారు.. అన్నీ అనుకున్నట్టే జరిగితే గోదారిలో రయ్ రయ్ మంటూ వెళ్లిపోవచ్చు.

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

గోదావరి అంటే అందాలు.. సరదా షికార్లు.. కానీ ఒకప్పుడు రవాణా రంగం అంతగా అభివృద్ధి చెందని రోజుల్లో గోదావరిపై అనేక ప్రాంతాలకు బోట్లలో సరుకు రవాణా చేసేవారు. పరిశ్రమలకు అవసరమయ్యే ముడిసరుకులను తరలించేవారు.అనేక పోర్టులకు విదేశాల నుంచి వచ్చే కార్గోను సైతం గోదావరి మీదుగా రవాణా చేసేవారు. బోట్లలో ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరేవారు.అయితే మళ్లీ ఇప్పుడు మునుపటి తరహాలో కారు చౌక అయిన జల రవాణా ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయిం చింది.గతంలోలా గోదావరి నదిపై బోట్లలో రవాణా జరిగేలా ప్రతిపాదనలు తయారు చేసింది. కాకినాడ నుంచి రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం నుంచి విజయవాడ, రాజ మహేంద్రవరం నుంచి భద్రాచలం, అంతర్వేది నుంచి నర్సాపురం,నర్సాపురం నుంచి సఖినేటిపల్లి, కోటిపల్లి-ముక్తేశ్వరం, నిడదవోలు నుంచి ఏలూరు వరకూ ప్రయాణించేలా మొత్తం పది మార్గాలను ఎంపిక చేసింది.ఈ రూట్లలో కాలువల అభివృద్ధి,కార్గో తరలింపు, పర్యాటకుల రవాణా పీపీపీ విధానంలో అభివృద్ధి చేయబోతోంది.

- పది రూట్లలో సరుకు సరఫరా
- వాటర్‌వేస్ అథారిటీ ప్రతిపాదన
- రవాణాకు సానుకూలత
- పర్యాటక బోట్లకు సౌకర్యం
- కాలువల అభివృద్ధికి టెండర్లు
- పీపీపీ విధానంలో పనులు
- మారనున్న గోదారి

ఎలా ఉపయోగిస్తారంటే..

కాకినాడ పోర్టుకు తెలంగాణ, తమిళనాడు నుంచి వేలాది లారీల్లో భారీ ఎత్తున బియ్యం విదేశాలకు ఎగుమతి కోసం వస్తోంది. భవిష్యత్తులో గోదావరిపై బియ్యాన్ని కాకినాడ పోర్టుకు తరలించేందుకు అడుగులు పడుతున్నా యి. తెలంగాణ నుంచి పోర్టుకు చైనాకు ఎగుమతి చేయడం కోసం భారీ బండరాళ్లను విజయవాడ -విశాఖ హైవే ద్వారా తరలిస్తు న్నారు. భవిష్యత్తులో ఈ రాళ్లను గోదావరి ద్వారా రవాణా చేయడానికి అనువుగా ఉంటుందని, ఖర్చు కలిసి వస్తుందని అంచనా వేస్తున్నారు. వివిధ దేశాల నుంచి కాకినాడ పోర్టుకు బొగ్గు, ఎరువులు దిగుమతవుతున్నాయి. వీటిని తెలంగాణతో పాటు విజయవాడ సమీపంలోని అనేక థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు గోదావరిపై బొగ్గు రవాణా చేయనున్నారు. భద్రాచలం, రాజమహేంద్రవరంలో కాగితం పరిశ్రమలకు పల్ప్‌ను రవాణా చేయడానికి డిమాండ్ ఉందని గుర్తించారు. రాజమహేంద్రవరం నుంచి ఏలూరు కాలువ ద్వారా విజయవాడకు అనేక రకాల సరుకుల కారుచౌక ధరకు రవాణా చేసేందుకు అవకాశాలు చాలా ఉన్నట్టు గుర్తించారు. కాకినాడ పోర్టుకు క్లింకర్, రాక్‌ఫాస్ఫేట్ వంటి అనేక రకాల కార్గో వివిధ పరిశ్రమలు విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. వీటన్నింటినీ గోదావరిపై కార్గో రవాణా ద్వారా భారీ ఎత్తున చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి భద్రాచలం వరకు కేవలం పర్యాటకుల కోసం ప్రస్తుతం బోట్లు నడుపుతున్నారు.ఈ రూట్‌లో భవిష్యత్తులో తెలంగాణకు వెళ్లే ప్రయాణికులు, పర్యాటకులను పెద్దఎత్తున తరలించేలా జలరవాణాను ప్రోత్సహించనున్నారు. నర్సాపురం-అంతర్వేది, ముక్తేశ్వరం -కోటిపల్లి రూట్లలో ప్రస్తుతం పంట్లలో రాకపోకలు సాగిస్తున్నారు. భవిష్యత్తులో ఈ రూట్లను ఆధునికీకరించి పెద్ద ఎత్తున వస్తు రవాణా,పర్యాటకులు, ప్రయాణికులు రాకపోకలు సాగించేలా జల రవాణా ప్రోత్సహించనున్నారు. దీంతో మళ్లీ పూర్వపు రోజులు రానున్నాయి.

ఎన్నిదారులో..

గోదావరిని పర్యాటకంగా,పారిశ్రామికంగా ఉపయోగించేందుకు అడుగులు పడుతున్నాయి. పరిశ్రమలకు ముడిసరుకుల రవాణా నుంచి ఆయా పరిశ్రమల్లో తయారైన ఉత్పత్తుల రవాణా వరకు గోదావరి నది ద్వారా చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఇందుకు నేషనల్ వాటర్ వే-4ను అభివృద్ధి చేసి పూర్వ వైభవం తెచ్చేలా సన్నాహాలు చేస్తోంది. కాకినాడ నుంచి పుదుచ్చేరి వరకు ఉన్న ఈ జల రహదారి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి ప్రాంతాలను కలుపుతూ 1,095 కిలోమీటర్లు పయనిస్తోంది. ఈ జల రహదారిలో అత్యంత కీలకమైన కాకినాడ, రాజమహేంద్రవరం,విజయవాడ, భద్రాచలం రూట్లను కొత్తగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ తాజాగా నిర్ణయించింది. ప్రధానంగా గోదావరి నది ద్వారా కాకినాడ, రాజమహేంద్రవరం, విజ యవాడ, భద్రాచలం,అంతర్వేది రూట్లలో కార్గో, పర్యాటక రవాణాకు ఎంతో డిమాండ్ ఉందని భావిస్తోంది.ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గోదావరిపై మొత్తం పది రూట్లను ఎంపిక చేసింది. ఈ మార్గాల్లో కాలువలను అభివృద్ధి చేసి సరుకు రవాణా, పర్యాటక రవాణా అభివృద్ధి చేయాలని ప్రతి పాదించింది.ఈ రూట్లలో ఒకప్పుడు సరుకు రవాణా ఎక్కువగా జరిగేది. కాకినాడ నుంచి బకింగ్‌హాం కాలువ వరకు ఎన్నో ఏళ్ల కిందట అనేక పరిశ్రమలకు ఈ కాలువ ద్వారా కార్గో రవాణా అయ్యేది.ఈ నేపథ్యంలో మళ్లీ గోదావరిపై రవాణాకు ద్వారాలు తెరవబోతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

గోదారి వయా..

కాకినాడ నుంచి రాజమహేంద్రవరం కాలువ, రాజ మహేంద్రవరం నుంచి విజయవాడకు ఏలూరు కెనాల్, రాజమ హేంద్రవరం నుంచి గండి పోచమ్మ, గండిపోచమ్మ నుంచి భద్రాచలం, పురుషోత్తపట్నం నుంచి భద్రాచలం, పురు షోత్తపట్నం నుంచి పోలవరం, పట్టిసీమ హిల్‌లాక్ టెంపుల్ నుంచి పట్టిసీమ మెయిన్ లాండ్, అంతర్వేది పల్లిపాలెం నుంచి నర్సాపూర్ వెస్ట్, నర్సాపురం నుంచి సఖి నేటిపల్లి, రాజోలు మండలం సోంపల్లి నుంచి అబ్బిరాజుపాలెం, కోటిపల్లి నుంచి ముక్తేశ్వరం వరకు మొత్తం పది రూట్ల లో గోదావరిలో కార్గో రవాణాకు వీలుగా రహదారులను అభివృద్ధి చేయబోతున్నారు. ఈ మేరకు వాటర్‌వేస్ అథారిటీ ఇటీవల టెండర్లు పిలిచింది. ఈ పది రూట్లను స్ట్రాటజిక్ మార్గాలుగా అభివృద్ధి చేసి పరిశ్రమల క్లస్టర్లు, మల్టీమోడల్ కనెక్టివిటీ పాయింట్స్‌ను గుర్తించాలని పలు కంపెనీలను ఆహ్వానించింది. గోదావరిపై గుర్తిం చిన పది రహదారులను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయనున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. ఒకప్పుడు కాకినాడ నుంచి పుదుచ్చేరి వరకు ఉన్న కాలువ ద్వారా ఏటా 11 మిలియన్ టన్నుల కార్గో రవాణాకు అవకాశం ఉందని కొంతకాలం కిందట వాప్కోస్ అనే సంస్థ అధ్యయనంలో తేల్చింది. ఇందులో 30శాతం కార్గో రవాణా కాకినాడ- రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం- భద్రాచలం, రాజమహేంద్రవరం-విజయవాడ జలమార్గాల్లో జరిగే అవకాశం ఉందని విశ్లేషించింది.


కాకినాడ కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

వలంటీర్లలా చేయలేం!

సచివాలయ ఉద్యోగుల ఆందోళన బాట

- నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన
- రిజిస్ట్రేషన్ విధులు బహిష్కరణ

పిఠాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు ఆందోళనబాట పట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనకు దిగారు. మునిసిపల్, నగరపంచాయతీ, మండలపరిషత్ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. వాట్సాప్ సర్వీస్ రిజిస్ట్రేషన్ విధులను సామూహికంగా బహిష్కరించారు.ఆత్మగౌరవం కోసమే తాము ఆందోళన బాట పట్టామని వారు స్పష్టం చేశారు. ఒక క్లస్టర్‌లో వలంటీర్ విధులను సచివాలయ ఉద్యోగులకు అప్పగించడాన్ని నిరసిస్తూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు శనివారం నుంచి ఆందోళన చేపట్టారు. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అం బేద్కర్ కోనసీమ జిల్లాలోని అన్ని నగరాలు, పట్టణాలు, గ్రామాల్లోని వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గతంలో వలంటీర్లు ఒక క్లస్టర్‌కు పరిమితమై విధులు నిర్వహించారని, ఇప్పుడు సచివాలయ ఉద్యోగులకు ఒకటి కంటే ఎక్కువ క్లస్టర్లు అప్పగిస్తూ మ్యాప్ చేయడంతో పాటు బలవంతంగా ఇంటింటికి తిరిగి విధులు నిర్వర్తించే బాధ్యతలు అప్పగిస్తున్నారని తెలిపారు. ఇదే రీతిలో వాట్సాప్ గవర్నెన్స్‌పై ఇంటింటా తిరిగి అవగాహన కల్పించడంతో పాటు ప్రతి ఇంటికి సర్వీస్ నమోదు చేయించాలని సచివాలయ ఉద్యోగులకు ఆదేశాలు జారీ అయ్యాయి. అధికారులు ఇచ్చిన ఆదేశాలపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సచివాలయ ఉద్యోగులు గూగుల్‌మీట్ ద్వారా సమావేశమై పలు నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం వాట్సాప్ సర్వీస్ రిజిస్ట్రేషన్ విధులను బహిష్కరించాలని, నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ నిర్ణయించింది. దీనికి అనుగుణంగా పిఠాపురం మునిసిపల్ కార్యాలయంతో పాటు కాకినాడ జిల్లాలోని పెద్దాపురం, సామర్లకోట, తుని పురపాలక సంఘాలు, గొల్లప్రోలు, ఏలేశ్వరం నగరపంచాయతీలు, కాకినాడ కార్పొరేషన్ కార్యాలయాల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి వార్డు సచివాలయ ఉద్యోగులు నిరసన తెలిపారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు ఎక్కడికక్కడ ఆందోళనలు నిర్వహించారు. గ్రామ, సచివాలయ ఉద్యోగుల మనోవేదన ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలనే నిరసన తెలియజేస్తున్నామని సచివాలయ ఉద్యోగులు స్పష్టం చేశారు.

826 మంది సచివాలయ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన కౌశలం సర్వే కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో సక్రమంగా సాగడంలేదని కమిషనర్ భావన సచివాలయం ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 826 మంది సచివాలయ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సర్వే పనులు 55 శాతం మాత్రమే జరగడంతో సచివాలయం సెక్రటరీల నిర్లక్ష్య వైఖరి మానుకోవాలని హెచ్చరించినట్టు సమాచారం. ఈ సర్వే ద్వారా నిరుద్యోగ యువత కోసం వర్క్ ఫ్రమ్ హోమ్ ఉద్యోగాలను అందించాలని ప్రభుత్వం యోచిస్తోంది. అటువంటి సర్వేను నిర్లక్ష్యం చేయడం సరికాదని సూచించినట్టు సమాచారం.

యూరియాకు టోకెన్ల సిస్టం

టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు ఆదేశం

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): యూరియాను రైతులకు టోకెన్ల సిస్టం ద్వారా పంపిణీ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. అమరావతి నుంచి సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ ద్వారా వివిధ జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులతో ఎరువుల సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలిరోజు రైతులకు టోకెన్లు క్రమ పద్ధతిలో అందజేయాలన్నారు. తర్వాత రోజు టోకెన్ల నెం బర్లను అనుసరించి యూరియా పంపిణీ చే యాలన్నారు. ప్రధానంగా పీఏసీఎస్‌లు, రైతు సేవా కేంద్రాల్లో మాత్రమే టోకెన్ విధానం అమ లుచేయాలన్నారు. ప్రైవేటు ఎరువుల డీలర్ల వద్ద వీఆర్వో పర్యవేక్షణలో ఎరువులను విక్రయించాలన్నారు. రాష్ట్రంలో యూరియా సమృద్ధిగా ఉందన్నారు. యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు తీసుకోవాలనిఆదేశించారు.కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ షాన్‌మోహన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

600 మెట్రిక్ టన్నులు రాక

కరైకల్ నుంచి కాకినాడ జిల్లాకు శనివారం 600 మెట్రిక్ టన్నుల యూరియా దిగుమతి అయింది. ఆదివారం మరో 1200 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ వెల్లడించారు. రైతులకు కొరత లేకుండా ప్రభుత్వం విడుదల చేస్తుందని తెలిపారు.

పబ్లిక్ రోడ్లపై విగ్రహాల ఏర్పాటుకు అనుమతిలేదు

కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో పబ్లిక్‌రోడ్లు, సైడ్‌వేలు, ఇతర ప్రజోప యోగ స్థలాల్లో ఎలాంటి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు అనుమతిలేదని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కాకినాడ నగరపాల కసంస్థ కార్యాలయం సమీపంలో శారదాంబ గుడి జంక్షన్ వద్ద శనివారం నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. శారదాంబ గుడి వద్ద కొత్తగా విస్తరించిన రోడ్డు కూడలిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా కూడలిని రోటరీ క్లబ్ సహకారంతో అభివృద్ధి చేసేందుకు అప్పగించామన్నారు. అయితే శనివారం తెల్లవారుజామున కొంతమంది సుప్రీంకోర్టు ఉత్తర్వులు అతిక్రమించి ఈ కూడలిలో దివంగత వంగవీటి రంగా విగ్రహ ఏర్పాటుకు ప్రయత్నించగా మున్సిపల్ అధికారులు, పోలీసులు దీన్ని నిరోధించారన్నారు. దీంతో ఆయా వ్యక్తులు ఆందోళనలకు దిగడంతో ఉద్రిక్తతకు దారితీసిందన్నారు. ఈ విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు పబ్లిక్‌రోడ్లపై ఎలాంటి విగ్రహాలను అనుమతించవద్దని తనతోపాటు జిల్లా ఎస్పీకి ఆదేశాలు జారీచేశారని తెలిపారు.

రూ.వెయ్యి కోట్లతో ఆదరణ పునఃప్రారంభం

- కులవృత్తుల వారికి పనిముట్లు ఇస్తాం
- రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ రెడ్డి అనంతకుమారి



మాట్లాడుతున్న రెడ్డి అనంతకుమారి

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రూ.వెయ్యి కోట్ల నిధులతో ఆదరణ పథకాన్ని పునఃప్రారంభించి, కులవృత్తుల వారికి పనిముట్లు అందిస్తామని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ రెడ్డి అనంతకుమారి తెలిపారు. కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం మధ్యాహ్నం స్థానిక ప్రగతిభవన్‌లోని డీఆర్డీఏ సమావేశహాలులో ఆమె కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రమణ్యం, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, బీసీ కార్పొరేషన్ జిల్లా విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏ.శ్రీనివాసరావు, వివిధ బీసీ కులాల సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ల డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా వెనుకబడిన తరగతుల ప్రజల సంక్షేమ, ఆర్థిక ప్రగ తికి చేపట్టివలసిన ప్రణాళికలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో 13 జిల్లాల్లో బీసీ కార్పొరేషన్ కార్యాలయాలు పనిచేస్తున్నాయని, త్వరలో 26 జిల్లాలన్నిటిలో కార్పొరేషన్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో బీసీ కార్పొరేషన్ కమిటీని నియమించలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కార్పొరేషన్ పునరుద్ధరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. 54 కుల కార్పొరేషన్ల ఏర్పాటు జరుగుతోందని, ఇప్పటికే 34 కుల కార్పొరేషన్లకు 236 మంది డైరెక్టర్లను నియమించగా, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 38 మందికి ఈ పదవులు లభించాయని, మిగిలిన కార్పొరేషన్ డైరెక్టర్ల నియామకాలు త్వరలోనే జరుగుతాయని పేర్కొన్నారు. బీసీ వర్గాలకు చెందిన చిన్న వ్యాపారులకు ఈ ఏడాది రూ200 కోట్లు సబ్సిడీ రుణాలు కల్పించనున్నామని, పేద బీసీ విద్యార్థులకు ఉపకారవేతనాలు, విదేశీ విద్యారుణాలు కల్పిస్తామని ఆమె తెలియజేశారు.

46,944 మందికి కుట్టు శిక్షణ

బీసీ కార్పొరేషన్ ద్వారా ఇప్పటివరకూ 46,944 మందికి కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చామని, త్వరలో శిక్షణ పొందిన వారికి ఉచితంగా కుట్టు మిషన్లు అందించి ఉపాధి కల్పిస్తామని అనంతకుమారి తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీలకు ఎన్టీఆర్ 24 శాతం రిజర్వేషన్ కల్పించగా..చంద్రబాబు దానిని 34 శాతానికి పెంచారని, వైసీపీ ప్రభుత్వం మళ్లీ 24 శాతానికి కుదించే దారుణానికి పాల్పడిందన్నారు. కూటమి ప్రభుత్వం రిజర్వేషన్లను మళ్లీ పెంచేందుకు కృషిచేస్తోందన్నారు. ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బీసీలకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు బీసీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందన్నారు. సమావేశంలో శెట్టిబలిజ, రజక, తూర్పుకాపు, కొప్పుల వెలమ, గవర, పద్మశాలి, అగ్నికుల క్షత్రియ, గౌడ, యాదవ, నాయీబ్రహ్మణ, శాలివాహన కార్పొరేషన్ల డైరెక్టర్లు, బీసీ సంక్షేమ సంఘాల ప్రతి నిధులు పాల్గొన్నారు.

30 వరకు స్కాలర్‌షిప్ దరఖాస్తుల స్వీకరణ

కాకినాడ రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 7న జరిగే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో పి.రమేష్ కోరారు. ప్రభుత్వ పరీక్షల కార్యాలయ www.bse.ap.gov.in వెబ్ సైట్‌లో ఆన్‌లైన్ అప్లికేషన్ అందుబాటులో ఉంచామని, ఆధార్ కార్డులో ఉన్న వివరాలను నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులన్నారు. ఇతర వివరాలకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్‌ను గానీ కాకినాడ డీఈవో కార్యాలయంలో గానీ సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్థిక భరోసా ఉంటుందన్నారు.

నేడు ఫారెస్ట్ ఆఫీసర్ల పోస్టులకు పరీక్షలు

కట్టుదిట్టమైన ఏర్పాట్లు : డీఆర్వో

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ల పోస్టుల పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు ఆదేశించారు. ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలో నిర్వహించే ఈ పరీక్షల ఏర్పాట్లపై కాకినాడ కలెక్టరేట్లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆదివారం జరిగే ఈ పరీక్షల కోసం జిల్లాలో 18 వేలమంది అభ్యర్థులకు 26 పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయన్నారు. అభ్యర్థులు ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల్లోపు పరీక్షా కేంద్రాల్లోకి ప్రవేశించాలన్నారు. అలాగే ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ల పరీక్షలు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.30 గంటల మధ్యలో పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించాలన్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ పటిష్టంగా అమలుచేయాలన్నారు. సమీపంలో ఉన్న జిరాక్స్ షాపులు మూసివేయించాలన్నారు. పరీక్షా కేంద్రంలో ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించడంలేదని తెలిపారు. సమావేశంలో ఎస్బీ డీఎస్పీ సత్యనారాయణ, డీఎంహెచ్‌వో నరసింహనాయక్, జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


యువోత్సాహం : కరపలో గణేశుడి ఊరేగింపులో యువత సందడి


మేము సైతం : అనపర్తిలో సందడిగా విజయగణపతి స్వామి శోభాయాత్ర


వెళ్లొస్తా : కోటిపల్లి వద్ద గోదావరిలో గణేష్ నిమజ్జనం

వెళ్లిరావయ్యా..ఉండ్రాళ్లయ్యా!


వెళ్లిరావయ్యా : ఉప్పాడ తీరంలో నిమజ్జనం

జై..జై గణేశా.. జైకొడతాం గణేశా అంటూ ఊరంతా ఊగిపోయారు..గణేశుడి విగ్రహాలను సందడిగా తరలించారు.. చిన్నా పెద్దా అందరూ డ్యాన్స్‌లతో అలరించారు.. మా దేవుడంటూ ఊరంతా నిమజ్జనోత్సవాల్లో భాగమయ్యారు.. ఆదివారం చంద్ర గ్రహణం కావడంతో శనివారం 11వ రోజునే దాదాపుగా గణేశ్ విగ్రహాలన్నీ నిమజ్జనోత్సవాలకు తరలించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎటు చూసినా ఊరేగింపులతో దద్దరిల్లిపోయింది.. సందడి మారింది.. బై బై గణేశా.. వెళ్లిరావయ్యా గణేశా అంటూ ఉత్సాహంగా వీడ్కోలు పలికారు..


నేనూ.. నీ వెంటే : కరపలో శివలింగం తరలింపు


వచ్చేశాం : కాకినాడ సాగరతీరానికి గణనాథులతో తరలివచ్చిన ట్రాక్టర్ల క్యూ


ఆనంద సాగరం : కాకినాడ తీరంలో గణేశ్ నిమజ్జనోత్సవాలు.. తరలివచ్చిన భక్తజనం


గణనాథుల రథం పరిశీలిస్తున్న రాజానగరం ఎమ్మెల్యే బత్తుల


నెత్తిన పెట్టుకుంటామయ్యా : శంఖవరం మండలం కత్తిపూడిలో మహిళలు ఇలా..


బుజ్జి గణపయ్యలు : గన్నవరం మండలం చాకలిపాలెంలో 31 విగ్రహాలతో కదిలిన గణనాథుల రథం


బై బై గణేశా : కాకినాడ రూరల్ సర్పవరంలో నిమజ్జనానికి గణేశుడి తరలింపు


అంబాజీపేటలో..


రాజమండ్రిలో..


కోరుకొండలో..


యానాంలో..


కాకినాడలో భారీ గణనాథుడిని తరలిస్తున్న చిన్నారులు

లడ్డూలు.. రూ.లక్షలు!


బిక్కవోలులో లడ్డూను రూ.1.25 లక్షలకు దక్కించుకున్న దోసారావు

చవితి ఉత్సవాల సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు లక్ష్మీగణపతి స్వామికి సురుచి ఫుడ్స్ 50 కిలోలు, మరో ఇద్దరు భక్తులు 60 కిలోలు, 20 కిలోల చొప్పున లడ్డూలను కానుకలుగా అందజేశారు. వీటికి వేలం నిర్వహించారు. 50 కిలోల లడ్డూను రాయవరం మండలం సోమేశ్వరానికి చెందిన నిమ్మకాయల శివ శంకరదోసారావు రూ.1.25 లక్షలకు దక్కించుకున్నారు. 60 కిలోల లడ్డూను విజయవాడ వద్ద వున్న గొల్లపూడికి చెందిన బి.నారాయణ్‌సింగ్-మానస దంపతులు రూ.66,666కు, 20 కిలోల లడ్డూను గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నేతేటి అరుణ కుమారి రూ.22,222కు దక్కించుకున్నారు. వీటిని ఉత్సవ కమిటీ ఛైర్మన్ చాగంటి సాయిబాబారెడ్డి, సభ్యులు పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి అందజేశారు.

-బిక్కవోలు (ఆంధ్రజ్యోతి)

యానాంలో...


లడ్డూను కైవసం చేసుకున్న భక్తుడు

యానాం కనకాలపేట రామాలయం సెంటర్లో కొలువైన మహాగణపతి 108 కిలోల లడ్డూతో పాటు మరో 10చిన్న లడ్డులను వేలం పాటలో అదే గ్రామానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ కనకాల సత్యనారాయణ రూ.లక్ష 15 వేల ఒక్క రూపాయికి దక్కించుకున్నారు.

-యానాం (ఆంధ్రజ్యోతి)

వెంకన్న ఆలయం... భక్త జనసంద్రం!

వాడపల్లిలో ప్రత్యేక పూజలు

రూ.65 లక్షల ఆదాయం

ఆత్రేయపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి వెంకన్న ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. నిండు మనసుతో మాడవీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి భారీ క్యూలైన్లలో నిలుచుని స్వామివారిని దర్శించుకున్నారు. వేకువజామునే సుప్రభాతసేవ, నీరాజనమంత్ర పుష్పం, ఐశ్వర్యలక్ష్మీ హోమం, బాలభోగంలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.65 లక్షలు లభించినట్టు ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.




ప్రత్యేక అలంకణలో స్వామివారు, ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

అమెరికామెడీ నాటికలు ప్రారంభం

కార్పొరేషన్ (కాకినాడ),సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ది యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యాన నిర్వహిస్తున్న అమెరికామెడీ నాటిక ప్రదర్శనలు శనివారం రాత్రి దంటు కళాక్షేత్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా చిరంజీవిని కుమారి కళాప్రాంగణాన్ని విశిష్ట అతిథిగా విచ్చేసిన ప్రముఖ నటుడు, రచయిత తనికెళ్ల భరణి ప్రారంభించారు. ముఖ్య అతిథి ఉప్పులూరి సుబ్బరాయశర్మతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. యంగ్మెన్స్ క్లబ్ అధ్యక్షుడు దంటూ భాస్కర్ సభకు అధ్యక్షత వహించారు. వంగూరి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగూరి చిట్టెన్ రాజు మాట్లాడుతూ నాలుగైదు దశాబ్దాల కిందట తాను రాసిన 30 హాస్య నాటికల నుంచి 5 నాటికలను ఎంపికచేసి 2రోజుల పాటు దంటు కళాక్షేత్రంలో ప్రదర్శించడం సంతోషకరమైన విషయమన్నారు. తనికెళ్ల భరణి మాట్లాడుతూ చిట్టెన్ రాజు అమెరికాలో ఉంటూ మన సంస్కృతి,సంప్రదాయాలను మర్చిపోకుండా అనేక సాహితీ సదస్సులను నిర్వహిస్తూ తెలుగుభాషా సాహిత్యాలకు ఇతోధిక సేవ చేయటం అభినందనీయమన్నారు. భరణి చేతులమీదుగా వేదికపై 5 పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. నాటక రంగానికి విశేష కృషి చేసిన ఆచార్య బీవీ.రమణమూర్తి (మార్గశీర్ష), ఆచార్య డీఎస్ఎన్. మూర్తిలను యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షులు దంటు భాస్కర్ సంస్థ తరపున సత్కరించారు. అనంతరం మహతి క్రియేషన్స్ హైదరాబాద్ వారిచే యమసభ, శ్రీజయ ఆర్ట్స్ హైదరాబాదు వారిచే మగపాత్ర లేని నాటిక ప్రదర్శించారు. కె.కృష్ణారావు, మార్ని జానకిరామ్ చౌదరి, సుచిత్రామూర్తి, పి.ప్రభుదాస్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు.


జ్యోతి ప్రజల్వన చేస్తున్న సినీ నటుడు తనికెళ్ల భరణి

'ఆదిత్య'లో విస్మయ గ్రాండ్ ఫినాలే

కాకినాడ రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల డేటాసైన్స్ విభాగం ఆధ్వర్యంలో విస్మయ-2025 గ్రాండ్ ఫినాలే రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించినట్టు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు తెలిపారు. శనివారం జరిగిన ముగింపు సదస్సుకు ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి అధ్యక్షత వహించగా జేఎన్టీయూకేలోని యూసీఈకేసీఎస్ఈ ప్రొఫెసర్ ఎల్.సుమలత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శేషారెడ్డి మాట్లాడుతూ దేనిలోనైనా ముందు మేల్కొన్న వారినే విజయం వరిస్తుందని విద్యార్థులకు సూచించారు. సుమలత మాట్లాడుతూ డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ప్రస్తుతం మార్కెట్లో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు డైటా సైన్స్ స్టార్టప్‌లను రూపొందించాలని పిలుపునిచ్చారు. డేటా సైన్స్ డీన్ వరుణ్‌రావు పరిశ్రమల్లో మారుతున్న సాంకేతికత, సాఫ్ట్‌వేర్ అంశాలను వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 20 కళాశాలల నుంచి 180 మంది డైటా సైన్స్ విద్యార్థులు హాజరు కాగా ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ఎస్.సుగుణారెడ్డి, ప్రిన్సిపాల్ కరుణ, మూర్తి, కార్తీక్, విజయలక్ష్మి పాల్గొన్నారు.



పోటీల్లో విజేతలకు ప్రతిభా పత్రాలను అందజేస్తున్న శేషారెడ్డి, సుమలత

రాజేంద్రచోలుడు స్మారకార్థం
రూ.వెయ్యి నాణెం విడుదల

అమలాపురం టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలోనే కాకుండా సముద్రాల మీదుగా నావికా దండయాత్రలు చేపట్టి వాణిజ్యం సంస్కృతిని విస్తరింపచేసిన చోళ సామ్రాజ్యాధినేత రాజేంద్రచోలుడు జ్ఞాపకార్థం ముంబై టంకశాల రూ.వెయ్యి నాణేన్ని విడుదల చేసింది. వలస రాజ్యాలను ఏర్పాటు చేయడంతో పాటు వాణిజ్య మార్గాలను విస్తరించేందుకు తొలిసారిగా రాజేంద్రచోలుడు వెయ్యేళ్ల క్రితమే నావికా దండయాత్రను చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆయనకు 'గంగయ్యకొండచోళ' బిరుదు ప్రదానం చేశారు. చోళసామ్రాజ్యాన్ని విస్తరించిన రాజేంద్రచోలుడిని స్మరించుకుంటూ వెయ్యవ వార్షికోత్సవాన్ని గంగయ్యకొండ చోళపురంలో జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ముంబై టంకశాల 40 గ్రాముల పూర్తి వెండితో 44 మిల్లీమీటర్ల వ్యాసంతో రూ.వెయ్యి నాణేన్ని విడుదల చేసింది. నాణెం ముందు భాగాన భారతదేశ రాజముద్ర, వెనుకవైపు రాజేంద్రచోలుని ముఖ చిత్రంతో పాటు తంజావూరులోని బృహదీశ్వరాలయం, చోలుడు ప్రయాణించిన కౌలను ముద్రించారు. ఈ నాణేన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన ప్రముఖ నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణకామేశ్వర్ ముంబై టంకశాల నుంచి సేకరించారు.



విడుదలైన రూ.వెయ్యి నాణెం



'నన్నయ' అనుబంధ కళాశాలలు రెండింటికి
ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్

దివాన్‌చెరువు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని రెండు కళాశాలలు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ సాధించాయని రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి తెలిపారు. విశ్వవిద్యాలయంలో శనివారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన బీవీ రాజు కళాశాల అధికారులు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ సర్టిఫికెట్‌ను రిజిస్ట్రార్ నుంచి అందుకున్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఐదు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలకే ఈ గుర్తింపు లభించిందన్నారు. అందులో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, భీమవరం బీవీ రాజు కళాశాల నన్నయ విశ్వవిద్యాలయానికి అనుబంధ కళాశాలలుగా ఉన్నాయన్నారు. రెండు కళాశాలల యాజమాన్య ప్రతినిధులకు రిజిస్ట్రార్‌తో పాటు ఉప కులపతి ఆచార్య ప్రసన్నశ్రీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీవీ రాజు కళాశాల ప్రిన్సిపాల్ ఐఆర్ కృష్ణంరాజు, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.


రిజిస్ట్రార్ స్వామి నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న బీవీ రాజు కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్



సీతాఫలం..

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం బ్రిడ్జి లంకలో సీతాఫల వృక్షంపై సీతాకోకచిలుకలు వాలి ఉడతలు కొట్టిన సీతాఫలాలను ఆరగిస్తుండగా ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

పి.మల్లవరంలో 'కింగ్ ఫిషర్'

● అరుదైన పక్షి ప్రత్యక్షం

తాళ్లరేవు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పీ.మల్లవరంలో ఓ అరుదైన పక్షి ప్రత్యక్షమైంది. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో ఎగురలేని స్థితిలో పడివున్న కింగ్‌ఫిషర్ పిట్టను అటవీ శాఖ అధికారులకు ధూళిపూడి వెంకటరమణ శనివారం అప్పగించారు. అటవీ శాఖ అధికారి వరప్రసాదరావు ఆదేశాల మేరకు ఫారెస్ట్ ఆఫీసర్లు గోపి, విష్ణు పిట్టను తీసుకువెళ్లి చొల్లంగి మడ అడవుల్లో విడిచిపెట్టారు.



అటవీ శాఖాధికారులు స్వాధీనం చేసుకున్న కింగ్‌ఫిషర్ పిట్ట

25 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి నిందితుడితో పోలీసులు

చింతూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు పోలీసులు శనివారం చింతూరులోని బస్టాండ్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఇందులో 25 కిలోల గంజాయిని స్వాధీనపర్చుకున్నట్టు చింతూరు ఎస్‌ఐ పీ.రమేష్ తెలిపారు. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా బూడుగూడకు చెందిన షేక్ రాంబాబు వయా చింతూరు మీదుగా గంజాయిని భద్రాచలం వైపు తరలిస్తుండగా పట్టుకున్నారు.

సౌమ్యతకు మారుపేరు ..చిన్నరాముడు

● తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి

● జిల్లా ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చింది : జేసీ చిన్న రాముడు

● ఆత్మీయ వీడ్కోలు పలికిన జిల్లా యంత్రాంగం



జేసీ చిన్నరాముడుకు జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎంత ఉన్నత స్థానంలో ఉన్నా ... సౌమ్యత, మృదుస్వభావం కలిగి ఉండడం జేసీ చిన్న రాముడు ప్రత్యేకత అని రాజమహేంద్రవరం కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు.బదిలీపై వెళుతున్న ఆయన్ని శనివారం సాయంత్రం ఆత్మీయ వీడ్కోలు సభను కలెక్టరేట్‌లో నిర్వహిస్తూ, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జేసీ మేఘస్వరూప్‌కి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్త విషయాలను నేర్చుకోవడంలో ఆయన ఎప్పుడూ ఆసక్తి చూపేవారని, ఇది ఆయనకు పని పట్ల ఉన్న నిబద్ధత అని అన్నారు. యోగాంధ్ర, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, తదితర కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడం వెనుక చిన్న రాముడు కృషి ఎంతో ఉందన్నారు. విధి నిర్వహణలో ఎప్పుడూ సానుకూల దృక్పథంతో ఉండేవారన్నారు. చిన్న రాముడు మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. చిన్న రాముడు మాట్లాడుతూ రాజమహేంద్రవరం జిల్లా ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చిందన్నారు. నూతన జేసీ మేఘస్వరూప్ మాట్లాడుతూ చిన్నరాముడు మంచి మనసున్న వ్యక్తిగా తన ప్రత్యేకతను సంపాదించుకున్నారన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సీతారామమూర్తి, ఆర్డీవోలు కృష్ణ నాయక్, రాణీసుస్మిత, డీపీవో మాదవరావు, డిప్యూటీ కలెక్టర్ భాస్కరరావు, డీఎస్‌వో పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

మోతుగూడెంలో బాహుబలి లారీ




రోటర్ వాల్ బోల్‌ను తీసుకొస్తున్న లారీ

మోతుగూడెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ నుంచి అల్లూరి జిల్లా మోతుగూడెంలోని పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి శనివారం 68 టైర్ల లారీ వచ్చింది. దీన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఇక్కడ నిర్మిస్తున్న 5,6 యూనిట్లకు సంబంధించి రోటర్ వాల్‌బోల్‌ను దీనిపై తీసుకొచ్చారు. 48 టన్నుల వరకు ఉంటుంది.

'డొంకరాయి' నుంచి నీటి విడుదల

● 3000 క్యూసెక్కుల నుంచి 1000 క్యూసెక్కులకు తగ్గించిన జెన్‌కో అధికారులు



జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామ జిల్లా సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి శనివారం ఉదయం మూడు వేల క్యూసెక్కుల నీటి నుంచి వెయ్యి క్యూసెక్కులకు తగ్గించినట్టు ఏపీ జెన్‌కో అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి జలాశయంలో నీటిమట్టం 1035.10 అడుగులకు చేరుకోవడంతో నీటిని విడుదల చేశారు. అలాగే డొంకరాయి కెనాల్ ద్వారా పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విద్యుత్ ఉత్పత్తి కోసం నాలుగువేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామని సీలేరు కాంప్లెక్స్ జెన్‌కో అధికారులు తెలిపారు.

ఎంపీడీవోలకు పదోన్నతులు

● రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి ఉత్తర్వులు జారీ

సామర్లకోట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎంపీడీవోలుగా పనిచేస్తున్నవారు ఏపీడీ, డీఎ ల్డీవోలుగా పదోన్నతులు పొందారు. ఈ మేరకు రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు 'ఆంధ్రజ్యోతి'కి అందిన సమాచారం మేరకు పదోన్నతులు పొందిన అధికారుల వివరాలిలా ఉన్నాయి. పెద్దాపురం ఎంపీడీవోగా పనిచేస్తున్న డీవీ. శ్రీలలిత విశాఖ జిల్లా డ్వామా కార్యాలయంలో డీవీవోగా పదోన్నతి పొందారు. కరప ఎంపీడీవోగా పనిచేస్తున్న మట్టపర్తి అనుపమ పశ్చిమగోదావరి జిల్లా డ్వామా కార్యాలయ డీవీవోగా పదోన్నతి పొందారు. సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో వ్యవసాయాధికారి ఫ్యాకల్టీగా పనిచేస్తున్న సుంకరణం సుబ్రహ్మణ్యశర్మ పదోన్నతిపై సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలోనే వ్యవసాయాధికారిగా పదోన్నతి పొందారు. అలాగే అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావు లపాలెం ఎంపీడీవోగా పనిచేస్తున్న ఎలుబూడి మహేశ్వరరావు అదే జిల్లాలో పీ.గన్నవరం డ్వామా కార్యాలయంలో ఏపీడీగా పదోన్నతి పొందారు. మారేడుమిల్లి ఎంపీడీవోగా పనిచేస్తున్న తూతిక శ్రీనివాస విశ్వనాథ్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఏపీడీగా పదోన్నతి పొందారు. ఈ మేరకు జీవో ఆర్‌టీ 724 పేరిట ఉత్తర్వులు జారీ అయ్యాయి. పదోన్నతులు పొందిన ఈ అధికారులు 15 రోజుల్లోగా వారికి కేటాయించిన స్థానాల్లో విధులు చేపట్టాల్సి ఉంది.

జిల్లాకు రెండు కొత్త పోలీస్ జాగిలాలు



సిబ్బందికి అందిస్తున్న ఎస్పీ నరసింహకిషోర్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి జిల్లాకు రెండు పోలీసు జాగిలాలు చేరుకున్నాయి. వాటి శిక్షణను ఎస్పీ నరసింహ కిషోర్ పరిశీలించి, డాగ్ స్క్వాడ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేసుల ఛేదనలో కీలకమైన జాగిలాల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ జాగిలాల పేర్లు కైరా, రాడో అని ఆయన చెప్పారు. రాడో నేరస్తులను పట్టుకోవడం, నార్కొటిక్ పదార్థాలు గుర్తించడంలో ప్రతిభ కనబరుస్తుందన్నారు. ఇది శిక్షణ కాలంలో రాష్ట్రస్థాయిలో మూడో స్థానం సాధించిందన్నారు. కైరా పేలుడు పదార్థాలు గుర్తించడంలో ప్రతిభ సాధించిందన్నారు. వీటి రాకతో దర్యాప్తులు మరింత శక్తివంతమవుతాయన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

జువైనల్ జస్టిస్ బోర్డుతో పీడీజే సమావేశం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత శనివారం సమావేశమయ్యారు. బాలనేరస్థుల కేసుల విషయంలో మెరుగైనసేవలు అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి శ్రీలక్ష్మీ, మూడో అదనపు మేజిస్ట్రేట్ పీవీ రాఘవేంద్రరావు, అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి ఒడిశా వాసి మృతి

తునిరూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి ఒడిశా రాష్ట్రానికి చెందిన యువకుడు మృతిచెందిన ఘటన తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. నర్సీపట్నం- గుల్లిపాడు రైల్వే స్టేషన్ల మధ్య మృతదేహం పడి ఉండడంతో సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడు వివరాలపై ఆరా తీశారు. కాగా, ఆయన వద్ద ఉన్న రైల్వే టికెట్, పాన్ కార్డు ఆధారంగా మృతుడు ఆచూకీని వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గోలాఘాట్ జిల్లాకు చెందిన రోమన్ గగోయ్ (35)గా గుర్తించారు. మృతిచెందిన వ్యక్తి అస్సాం రాష్ట్రం నుంచి కేరళకు ట్రైన్‌లో ప్రయాణిస్తున్నాడు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రంగా విగ్రహం ఏర్పాటు..తొలగింపు

» కాకినాడలో ఉద్రిక్తత

» అనుమతుల్లేకుండా ప్రభుత్వ స్థలాల్లో విగ్రహాల ఏర్పాటుకు వీల్లేదు: కమిషనర్



నాయకులతో చర్చిస్తున్న కమిషనర్ భావన

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలోని శారదా దేవి గుడి, ముత్తా గోపాలకృష్ణ కూడలిలో రంగా విగ్రహం ఏర్పాటు వివాదాస్పదంగా మారింది. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జంక్షన్ అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇంతలో ఆ జంక్షన్లో విగ్రహాల రగడ మొదలైంది. కొంతకాలంగా ఆ జంక్షన్లో ఎవరికివారుగా తమ నాయకుడి విగ్రహం పెట్టాలంటే, కాదు తమ నాయకుడి విగ్రహం పెట్టాలని పోటీపడుతున్నారు. ఈ క్రమంలో గతంలో పరిస్థితిని అర్థం చేసుకున్న కమిషనర్ భావన... కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాల మేరకు రాత్రికి రాత్రే జంక్షన్‌లో ఏర్పాటుచేసిన దిమ్మను తొలగించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో సమస్య సద్దుమణిగిందనుకున్నారు. ఇంతలో తిరిగి రోటరీ క్లబ్ పనులు ప్రారంభించగా శనివారం తెల్లవారుజామున కొంతమంది వంగవీటి రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సమాచారం తెలుసుకున్న కమిషనర్ భావన సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసుల సహకారంతో విగ్రహాన్ని తొలగించారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆగ్రహించిన ఆందోళనకారులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకుని నిరసన తెలిపారు. విగ్రహాన్ని తిరిగి అక్కడే పెట్టాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య కొంతసేపు వాగ్వాదం జరిగింది. ఆందోళనకారులు బ్రిడ్జి పైన ఆందోళన, ధర్నా చేపట్టడంతో విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు, వాహనాదారులు చాలా ఇబ్బందులకు గురై ఆందోళనకారులపై అసహనం వ్యక్తం చేశారు. కమిషనర్ భావన ఆందోళనకారులతో చర్చించి అనుమతులు లేకుండా పబ్లిక్ ప్లేస్‌లో నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేయడానికి వీలులేదన్నారు. చర్చలు విరమింపజేశారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, డీసీపీ కేవీ కృష్ణారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొబ్బరిచెట్టు నుంచి పడి వార్డు సభ్యుడి మృతి



కముజు సూరిబాబు (ఫైల్ ఫొటో)

ముమ్మిడివరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం చినకొత్తలంక గ్రామ పంచాయతీ రెండో వార్డు సభ్యుడు కముజు వీరవెంకట సత్యనారాయణ(సూరిబాబు) (48) కొబ్బరిచెట్టు పైనుంచి పడి మృతిచెందాడు. సూరిబాబు శనివారం ఉదయం బొండం తీసేందుకు కొబ్బరిచెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తూ జారి పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా సూరిబాబుకు భార్య, కుమార్తె, తల్లిదండ్రులు ఉన్నారు. మృతదేహాన్ని ముమ్మిడివరం పోలీసులు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అందజేశారు. మృతుడి భార్య శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండే సూరిబాబు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆరెళ్ల చిన్నారిపై పిచ్చికుక్క దాడి



పిచ్చికుక్క దాడిలో గాయపడిన లక్ష్మీదుర్గ

పెద్దాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణంలో శనివారం ఆరేళ్ల చిన్నారిపై పిచ్చి కుక్క దాడి చేసింది. స్థానికుల వివరాల ప్రకారం.... పట్టణంలోని తాడితోట ప్రాంతానికి చెందిన పాసిల లక్ష్మీదుర్గ ఇంటి బయట ఆడుకుంటుండగా పిచ్చికుక్క ఒక్కసారిగా దాడి చేయడంతో చిన్నారి తలపై తీవ్ర గాయాలయ్యాయి. తొలుత స్థానిక ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తీసుకెళ్లారు.

గోదావరిలోకి దూకిన వృద్ధురాలు

పి.గన్నవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆమెకు ఏం కష్టం వచ్చిందో తెలియదు కానీ స్థానికులు చూస్తుండగానే పి.గన్నవరం అక్విడెక్టుపై నుంచి గోదావరి నదిలోకి దూకేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పి.గన్నవరం అక్విడెక్టు చెంతనే లంకలగన్నవరం వైపు ఉన్న వినాయకుడిని నిమజ్జనం చేసేందుకు అక్విడెక్టుపైకి తీసుకువచ్చారు. అప్పటికే అక్కడ తచ్చాడుతున్న ఓ వృద్ధురాలు వారు చూస్తుండగానే అక్విడెక్టు పైనుంచి దూకేసిందని ప్రత్యక్షసాక్షులు చెప్తున్నారు. దీనిపై పోలీసులకు సమాచారం అందించగా ఎస్‌ఐ బి.శివకృష్ణ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని అక్విడెక్టుపై వృద్ధురాలు వదిలేసిన చెప్పులను పరిశీలించి ఈ సంఘటనకు సంబంధించి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. అయితే పోలీసులు చెప్పులను స్వాధీనం చేసుకుని అక్విడెక్టుకు ఇరువైపులా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తామని ఎస్‌ఐ తెలిపారు. కాగా వృద్ధురాలి ఆచూకీ కోసం బంధువులు ఎవ్వరూ రాలేదు.

సత్యదేవుడి సన్నిధిలో ట్రాన్స్‌కో సీఎండీ పూజలు



వేదపండితుల ఆశీర్వచనం పొందుతున్న సీఎండీ పృథ్వీతేజ

అన్నవరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శనివారం ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు.

నేడు ఆలయం మూసివేత

చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం సత్యదేవుడి ఆలయం మూసివేయనున్నట్టు ఈవో సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల వరకు వ్రతం టిక్కెట్లను విక్రయిస్తామని, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సర్వదర్శనాలు నిలుపుదల చేసి ఆలయ తలుపులు మూసివేయనున్నట్టు ప్రకటించారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ జరిపి 7గంటల నుంచి సర్వదర్శనాలు, వ్రతాలు పునఃప్రారంభం అవుతాయని పేర్కొన్నారు.కాగా చంద్ర గ్రహణం రాత్రి 9:50గంటలకు ప్రారంభమై 1:31 వరకు ఉంటుందని దేవస్థానం పండితులు తెలిపారు.

సత్యదేవుడికి వేడుకగా తిరుచ్చిసేవ

సత్యదేవుడికి తిరుచ్చిసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై తూర్పురాజ గోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం ముమ్మారు పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ ప్రదక్షిణ నిర్వహించారు. హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.



ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 15 నుంచి యూటీఎఫ్ రణభేరి

పోస్టర్ ఆవిష్కరించిన నాయకులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అమలాపురం టౌన్/రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19 వరకు యూటీఎఫ్ రణభేరి జాతా నిర్వహిస్తున్నట్టు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.సురేంద్రకుమార్, ఎంటీవీఏఎస్ సుబ్బారావు తెలిపారు. ఉపాధ్యాయుల ఆర్థిక పరమైన సమస్యలను ఇంత వరకు పరిష్కరించలేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదన్నారు. అమలాపురం ఎంప్లాయీస్ హోంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్. జ్యోతిబసు శనివారం రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం విపరీతంగా పెరిగిపోయిందన్నారు. పరీక్షల మూల్యాంకనం విద్యాశక్తి ఆన్‌లైన్ అప్‌లోడ్, గ్రీన్ పాస్‌పోర్టు తదితర బోధనేతర పనులకు సమయం వెచ్చించాల్సి వస్తుందన్నారు. తక్షణం ప్రభుత్వం పీఆర్సీ కమిషన్‌ను నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలని, బకాయిపడ్డ డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై ఈ నెల 15 నుంచి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో జరిగే రణభేరి జాతాను విజయవంతం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. సంఘ నాయకులు పెన్నాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లారీ-బైక్ ఢీ.. యువకుడి మృతి



ప్రమాదంలో మృతిచెందిన కోట శ్రీనివాస్

కె.గంగవరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని యండగండి వద్ద ఊక లోడు లారీ, మోటార్‌బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. శనివారం పామర్రు నుంచి అంగర వైపు వెళుతున్న ఊకలోడు లారీ, యండగండి నుంచి పామర్రు వైపు వెళుతున్న కోట శ్రీనివాస్ బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న యండగండికి చెందిన శ్రీనివాస్(23) అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం నుంచి గణపతి నిమజ్జనంలో హుషారుగా పాల్గొన్న శ్రీనివాసు ప్రమాదంలో మృతి చెందడంతో యండగండిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పామర్రు ఎస్‌ఐ ఎస్‌కే జానీ బాషా చెప్పారు.

శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో విశేష పూజలు

పిఠాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. త్రయోదశి, చతుర్దశి తిథులు కలిసి ఉన్న నేపథ్యంలో శ్రీపాదశ్రీవల్లభులకు ఏకాదశ రుద్రాభిషేకం, సర్వపుష్ప పూజ నిర్వహించారు. దత్తహోమం, గోపూజ, పల్లకీ సేవ జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా ఈవో ఆర్.సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

11న 5కే రెడ్ రన్ పోటీలు

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యువతలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన పెంచేందుకు ఈ నెల 11న మార్థన్ 5కే రెడ్ రన్ పోటీలు నిర్వహించనున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ వివేకానంద పార్కు ముందు గేటు వద్ద ఉదయం 6.30 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయి. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల నుంచి 17 నుంచి 25 మధ్య వయసున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.7వేలు ఇస్తారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాస్ సహకారంతో పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్‌లకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. మరిన్ని వివరాలకు క్లస్టర్ ప్రోగ్రాం మేనేజరు పి.బాలాజీని 9949 495022 నెంబరులో సంప్రదించాలి. మొత్తం కార్యక్రమాన్ని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్-టీబీ అధికారి డాక్టర్ ఐ.ప్రభాకర్ పర్యవేక్షిస్తారు.

కిడ్నీ బాధితునికి ఆర్థిక సాయం

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధితో బాధపడతున్న చల్లపల్లి సతీశ్‌కి సంపర ఎంప్లాయీస్ అసోసియేషన్ రూ.1,61,162 సమకూర్చింది. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో కలెక్టర్ షాన్‌మోహన్ బాధితుడి తండ్రి నాగేశ్వరరావుకు అందజేశారు. కలెక్టర్ సొంతంగా రూ.10వేలు ఇచ్చి ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. అసోసియేషన్ ఫౌండర్ వడ్డి వెంకటేశ్వర్లు, సభ్యులు మల్లిపూడి శివప్రసాద్, వాడపర్తి తాతీలు, కుందూరి వెంకటసుబ్బారావు, కొమ్మన శ్రీనివాసరావు, యానాల మౌళి పాల్గొన్నారు.

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలలోని తొలి తిరుపతి క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. సుమారు 10వేల మందికి పైగా శృంగార వల్లభస్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,88,431 లభించిందని ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.




సామర్లకోటలో అత్యంత ఎత్తైన గణపతి విగ్రహాన్ని, గొల్లప్రోలు కరణంగారితోట కనకదుర్గమ్మ ఆలయం వద్ద నిలిపిన లక్ష్మీ గణపతి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యాలు

బై బై గణేశా!

గణేశ నామస్మరణతో మార్మోగిన పట్టణాలు, గ్రామాలు

నిమజ్జనానికి భారీగా తరలిన గణనాథులు

పిఠాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జైగణేశ్ నామస్మరణతో పిఠాపురం మార్మోగింది. వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా పలుచోట్ల ప్రత్యేకపూజలు, అన్నదానాలు జరిగాయి. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నిలిపిన గణనాథులను వాహనాలపై ఉంచి నిమజ్జనానికి తరలించారు. బాణసంచా, సాంస్కృతిక ప్రదర్శనలతో కోలాహలంగా మారింది. నిమజ్జనోత్సవంలో పాల్గొన్న యువకులు పరస్పరం రంగులు చల్లుకుంటూ ముందుకు సాగారు. చిన్న విగ్రహాలను పట్టణ శివారులో ఉన్న ఏలేరు, పీబీసీ కాలువల్లో నిమజ్జనం చేశారు. భారీ విగ్రహాలను ఉప్పాడ వద్ద సముద్రంలో నిమజ్జనం చేసేందుకు ప్రదర్శనగా తరలివెళ్లారు. 80శాతం పైగా విగ్రహాలను రాత్రి వరకు నిమజ్జనం చేసినట్టు పోలీసులు తెలిపారు. ప్రతి విగ్రహానికి ఒక పోలీసు కానిస్టేబుల్/హోంగార్డును ఎస్కార్టుగా ఉంచారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ జి.శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వినాయక నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. చవితి పందిర్లలో పదిరోజులుగా పూజలు అందుకున్న గణనాథుడికి అంతే భక్తి శ్రద్ధలతో వీడ్కోలు పలికారు. చిన్నవాటి నుంచి భారీ విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నిలిపిన వినాయక విగ్రహాలకు పూజల అనంతరం ట్రాక్టర్లు, ఆటోలు, ఇతర వాహనాలపై ఉంచి పట్టణ వీధుల్లో ఊరేగించారు. పలు విగ్రహాలను గొల్లప్రోలు రైల్వేస్టేషన్ వద్ద గల పీబీసీ కాలువలో నిమజ్జనం చేశారు. మిగిలిన వాటిని ప్రదర్శనగా ఉప్పాడ సముద్రం వరకు తీసుకెళ్లి అక్కడ నిమజ్జనం చేశారు.

కరప (ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా శనివారం 150కిపైగా విగ్రహాలను సమీప కాలువల్లో నిమజ్జనం చేశారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన లడ్డూల వేలంపాటల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కొంగోడు బీసీ పేట గణేష్ మండపంలో 15 కిలోల లడ్డూను కోటా శ్రీనివాసరావు-భూలక్ష్మి దంపతులు 75,500కి దక్కించుకున్నారు. కరప పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా వాడవాడలా గత తొమ్మిది రోజులుగా జై గణేశా... గణపతిబొప్పా మోరియా... గణేష్ మహారాజ్‌కి జై అనే భక్తుల నామస్మరణతో మార్మోగాయి. కాకినాడ రూరల్ మండల పరిధిలోని ప్రత్యేక మందిరాల్లో కొలువుదీరిన వినాయక విగ్రహాలకు శనివారం ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయాల కమిటీల ఆధ్వర్యాన భారీ అన్నదానాలు జరిపారు. విగ్రహాలను ప్రత్యేక పూలతో విశేషాలంకరణ చేసిన వాహనాలపై ఉంచి భక్తుల ఆధ్వర్యంలో ఊరేగించారు. వెళ్లిరా గణనాథా... గణేశ్ మహారాజ్‌కి జై అంటూ నృత్యాలు, మేళతాళలు, డీజే సౌండ్‌లతో భక్తిపారవశ్యంతో సూర్యారావుపేట సముద్ర తీరానికి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. గణేశ నగర ఉత్సవ సమితి కో-ఆర్డినేటర్ రంబాల వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు వై.మాల కొండయ్య, రమణరాజు ఆధ్వర్యంలో బీచ్‌లో విగ్రహాల నిమజ్జనానికి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నిర్వాహకులకు ప్రశంసా పత్రాలు అందించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా వాకలపూడి మెరైన్ సీఐ టి.రామ్మోహన్‌రెడ్డి, ఎస్ఐ సురేష్, తిమ్మాపురం ఎస్ఐ వై.గణేష్‌కుమార్ గజ ఈతగాళ్లతో పహారా కాయించారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ తీరం గణేశ నిమజ్జనాలతో హోరెత్తింది. పిఠాపురం, గొల్లప్రోలు, కత్తిపూడి, నవంఖండ్రవాడ, కొండెవరం, ఇసుకపల్లి, నాగులాపల్లి తదితర గ్రామాల నుంచి వినాయక విగ్రహాలను ట్రాక్టర్లు, వ్యాన్లు, లారీల్లో ఊరేగింపుగా ఉప్పాడ బీచ్ రోడ్డుకు తీసుకొచ్చి నిమజ్జనం చేశారు. ఊరేగింపులు, డీజేల డ్యాన్సలతో తీరం హోరెత్తింది. విగ్రహాల నిమజ్జనం అనంతరం యువకులు సముద్రంలో స్నానాలు చేశారు. కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్ బందోబస్తు ఏర్పాటుచేశారు. కొత్తపల్లి పోలమ్మ గుమ్మం సెంటర్లో 40వ గణేశ ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వ ర్యంలో వినాయక విగ్రహాన్ని ప్రత్యేక వాహ నంలో కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి గ్రామాల్లో బ్యాండ్ మేళాలు, డీజే డ్యాన్సులతో ఊరేగించారు. కమిటీ సభ్యులు ప్రత్యేకంగా ధరించిన దుస్తులతో చేసిన డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి. అనంతరం ఊర చెరువులో వినాయకుడిని నిమజ్జనం చేశారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకున్న గణపతులను ఆయా కమిటీల నిర్వాహకులు... మేళతాళాలు, డీజే సౌండ్లు, భక్తుల నృత్యాలతో ప్రదర్శనగా పెదబ్రహ్మదేవం నుంచి జి.మేడపాడు, వేట్లపాలెం, హుస్సేన్‌పురం, సామర్లకోట మీదుగా తీసుకువచ్చి గోదావరి జలాల్లో నిమజ్జనం చేశారు. సీఐ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తూ పెద్ద ఎత్తున బందోబస్తు నిర్వహించారు. పరిస్థితిని సామర్లకోట తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, కమిషనరు ఎ.శ్రీవిద్య పర్యవేక్షిం చారు. ట్రాఫిక్ ఇబ్బంది తలెత్తకుండా ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు, సిబ్బంది ఓవర్‌బ్రిడ్జిపై ప్రత్యేక నియంత్రణ చేశారు. పట్టణంలో అత్యంత ఎత్తైన ఇండస్ట్రియల్ ఎస్టేట్ గణపతిని ఉత్సవ కమిటీ నిర్వాహకుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో భక్తులు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు.

రేపు వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వికాస ఆధ్వర్యంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల్లోపు అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ.12వేల నుంచి రూ.20 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుంది. ఆసక్తి గల వారు సోమవారం ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరు కావాలి. మరిన్ని వివరాలకు 77993 76222 నెంబరును సంప్రదించాలన్నారు.

'ఆత్మగౌరవం చంపుకోలేం'

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వార్డు సచివాలయ ఉద్యోగులతో వలంటీర్ విధులు చేయించి ఆత్మగౌరవం దెబ్బతినేలా చేస్తున్నారంటూ రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక పిలుపుమేరకు శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వద్ద నిరసన తెలిపి డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌కి వినతిపత్రం అందజేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి రోజంతా విధులు నిర్వర్తించారు. ఉద్యోగులు వలంటీరు పని చేయడంతో ఆత్మగౌరవం దెబ్బతింటోందన్నారు. లక్షా పాతికవేల మంది ఉద్యోగుల బాధను ప్రభుత్వం గమనించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

కలెక్టరేట్ ఎదుట వామపక్షాల ధర్నా

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత్ సరుకులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారీగా విధిస్తున్న సుంకాలను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దువ్వా శేషబాబ్జీ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకులు చిన్నబిల్లి నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు మాట్లాడుతూ అమెరికాలో ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత అమెరికన్ కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే భారత్ వంటి దేశాలపై ఆర్థిక దాడి చేస్తున్నారని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బోడకొండ, ప్రతినిధులు కేవీ రామయ్య, దుర్గాప్రసాద్, మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి భవాని, నాయకులు గొడుగు సత్యనారాయణ, నాగమణి, రాఘవులు, సత్తిబాబు, స్నేహిత శివ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవం

కాకినాడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ ఇండియా 120వ ఆవిర్భావ దినోత్సవాన్ని కాకినాడ సూర్యారావుపేట బ్రాంచిలో శనివారం ఘనంగా నిర్వహించారు. బ్రాంచి మేనేజరు కె.వాసుదేవరావు మాట్లాడుతూ విదేశాల్లో కూడా శాఖలు స్థాపించి అంతర్జాతీయంగా బ్యాంకింగ్ సేవలను అందించడంలో ముందంజలో ఉందన్నారు. బ్యాంకు సిబ్బంది మమత, డీబీవీ స్వామి, శివ తదితరులు పాల్గొన్నారు.

'బడుగు, బలహీనవర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం'



బీసీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనంతకుమారిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, బీసీ కులాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర బీసీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ రెడ్డి అనంతకుమారి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. నగర పర్యటనలో భాగంగా శనివారం కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన ఆమెను శాలువాతో సత్కరించారు. అనంతరం 18వ డివిజన్ జగన్నాథపురంలో ఉచిత కుట్టుమిషన్ సెంటర్‌ను సందర్శించి శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడి వారు కుట్టిన డ్రెస్‌లను పరిశీలించమే కాక ఆమె స్వయంగా డ్రెస్ కుట్టారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, బొడ్డు శివాజీ, నులుకుర్తి వెంకటేశ్వరరావు, మందాల గంగసూర్యనారాయణ, కొపనాతి నాగకుమారి, తుమ్మల సునీత, రిక్కా లక్ష్మి, వడిసెల దాలమ్మ, కొల్లు కుమారి, బత్తిన ఉమ, దేవు జయలక్ష్మి, డబ్బీరు జగదాంబ, కోడూరి నీలిమ, ముత్యాల రాణి తదితరులు పాల్గొన్నారు.

'యూరియాపై వైసీపీ చిల్లర రాజకీయాలు'



పిఠాపురంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నా వైసీపీ చిల్లర రాజకీయాలు చేస్తోందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. వైసీపీ ఎన్ని కుట్రలు పన్నినా రైతులు నమ్మకపోవడంతో జగన్ సైకోలా మారారని మండిపడ్డారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు చీకొడతారనే సిగ్గు లేకుండా పూటకో మాయమాటు, రోజూ అబద్ధాలు చెప్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఏ రైతుకూ యూరియా కొరత అనేది లేకుండా సీఎం చంద్రబాబు నిరంతరం సమీక్షిస్తున్నారని చెప్పారు. కాకినాడ పోర్టు ద్వారా 40వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని తెలిపారు. ప్రభుత్వం ప్రతి రైతుకు రెండు బస్తాల యూరియా అందేలా చూస్తోందన్నారు. శనివారం జిల్లా అంతటికీ 600 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేస్తున్నారని తెలిపారు. ధాన్యం బకాయిల కోసం రైతులు రోడ్డెక్కినా అప్పటి జగన్ సర్కారు పట్టించుకోలేదని విమర్శించారు. రైతులు ఎవ్వరూ ఆందోళన చెందవద్దని, యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆ స్థలాన్ని నిషేధిత జాబితా నుంచి తొలగించాం: కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట సర్వే నెం.197/10లో ఉన్న 1.95 సెంట్ల స్థలాన్ని 22(ఎ) జాబితా నుంచి తొలగించామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన వెలువరించారు. తద్వారా భూమిపై క్రయ, విక్రయాల హక్కులు పొందుతారన్నారు. పిల్లల చదువులు, పెళ్లిళ్ల, వృద్ధుల వైద్యం వంటి అత్యవసర అవసరాల కోసం తమ ఇళ్లను, స్థలాలను అమ్ముకోవడానికి వీలు కలుగుతుందన్నారు.

అక్కడ గృహాలు నిర్మించుకుని ఉన్నవారికి ఎంతో సంతోషం కలిగిందన్నారు. రమణయ్యపేటకు చెందిన ఉషోదయ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల విజ్ఞప్తి మేరకు కలెక్టర్ పరిశీలించి వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించారు.

నకిలీ సర్టిఫికెట్లపై కఠినంగా వ్యవహరించాలి

ఆదివాసీ ఎరుకుల సామాజికవర్గం డిమాండ్

పిఠాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలతో తమ ప్రయోజనాలకు భంగం వాటిల్లేలా వ్యవహరిస్తున్న వారిపై విచారణ జరిపి కఠినంగా చర్యలు తీసుకోవాలని ఆదివాసీ ఎరుకుల సామాజికవర్గ సంక్షేమ సంఘం కాకినాడ జిల్లా సమావేశం డిమాండ్ చేసింది. పిఠాపురంలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ సామాజికంగా, రాజకీయంగా, ఉద్యోగపరంగా ఆదివాసీ ఎరుకులకు తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు. ప్రతి మండలంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. ఎరుకుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఉపాధి కల్పనకు నూరు శాతం సబ్సిడీపై రుణాలు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం కాకినాడ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన మనపాటి రామకృష్ణ, సింగం వీరరాఘవలను సత్కరించారు. నాయకులు సింగం కొండరాజు, మసిగిరి రాంబాబు, అమలదాసు నూకరాజు, సంగడాల శ్రీను, సింగం లోకేష్, అమలదాసు శ్రీను, మసిగిరి శ్రీను, సాల రాంబాబు, సింగం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఆ ఘటనతో మాకు సంబంధం లేదు'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో శాంతియుతంగా జరిగిన మిలాద్-ఉన్-నబీ శాంతి ర్యాలీలో కొందరు ముస్లింలు వేరే దేశాల జెండాలను ప్రదర్శించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన ఘటనతో తమకు సంబంధం లేదని నగర ముస్లిం నాయకులు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మస్జిద్ ఏ ఆజం అధ్యక్షుడు ఖాదర్ ఆలీ ఖాన్, గవర్నమెంట్ ఖాజీ షేక్‌గౌస్ మొహిద్దీన్ హబీబీ, కొత్తూరు మదీనా మస్జిద్ అధ్యక్షుడు ఎండీ కుతుబుద్దీన్, జె.రామారావుపేట మక్కా మస్జిద్ కార్యదర్శి ఎండీ ఖాజా మొహిద్దీన్, టీడీపీ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ ఖాన్, ముస్లిం నాయకులు ఫైసల్, ఎండీ అన్సర్, ఎండీ గాలిబ్ మాట్లాడారు. అనుకోకుండా జరిగిన ఈ ఘటనతో తమకు సంబంధం లేకపోయినప్పటికీ పర్మిషన్ లేకుండా వేరే దేశం జెండాను ప్రదర్శించడం తప్పుగా భావిస్తున్నామన్నారు. సమాజానికి, పోలీసులకు క్షమాపణలు చెప్పారు.

బి.కొత్తూరులో నిషేధాజ్ఞలు

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం బి.కొత్తూరులో రెండు రోజుల క్రితం జరిగిన వినాయక నిమజ్జనోత్సవంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుని ఐదుగురికి గాయాలయ్యాయి. తొమ్మిది మందిపై వివిధ సెక్షన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. వివిధ సంఘాల నాయకులు పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు విధించడంతో పాటు పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

ఎస్పీకి బీజేపీ శ్రేణుల ఫిర్యాదు

కాకినాడ క్రైం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకుని కొంతమంది పాకిస్తాన్, పాలస్తీనా దేశాల జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ శాంతి భద్రతలకు భంగం వాటిల్లే విధంగా నగరంలో శుక్రవారం నాలుగు కార్లలో ర్యాలీ నిర్వహించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి చర్యకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ శ్రేణులు ఎస్పీ జి.బిందుమాధవ్‌కు శనివారం ఫిర్యాదు చేశాయి. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, మీడియా కో-ఆర్డినేటర్ తుమ్మలపల్లి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజి'లెన్స్'

సామర్లకోట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (రాజమహేంద్రవరం) అధికారులు శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ ఏజెన్సీలో బయోస్టిమిలెంట్స్‌కు చెంది జీ2, జీ3 ఆథరైజేషన్ పత్రాలు లేకుండా అక్రమ విక్రయాలు జరుపుతున్నట్టు గుర్తించారు. రూ.80,136 విలువైన బయోస్టిమిలెంట్స్ అమ్మకాలను నిరోధిస్తూ విజిలెన్స్ అధికారులు నోటీసులు జారీ చేశారు. విజిలెన్స్ సీఐ ఐ.గోపాలరావు, విజిలెన్స్ తహసీల్దారు కె.విజయకుమార్, సామర్లకోట మండల వ్యవసాయాధికారి వి.మురళీధర్, ఏఈవో శాంతి కమల, వీఏఏలు పాల్గొన్నారు.



మహిళలతో కలిసి అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే చినరాజప్ప

'వాట్సాప్ గవర్నెన్స్‌ను తప్పక వినియోగించుకోవాలి'

పెద్దాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రతి ఒక్కరూ తప్పక వినియోగించుకోవాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. పాశీల వీధిలో శనివారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని పౌరుల మొబైల్స్‌లో 955200009 నంబరు సేవ్ చేయించేలా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. తద్వారా ప్రజలెవ్వరూ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, కూటమి నేతలు, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొనారు.



ఏపీడీటీఐఎన్ చైర్మన్ శ్రీధర్ కొసరాజు నుంచి ధ్రువపత్రాలు పొందిన విద్యార్థులు

'కాకినాడను ఏఐ కేంద్రంగా మార్చాలి'

కాకినాడ రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అధునాతన పరిశోధనలకు కేంద్రంగా మార్చాలని ఏపీ డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ నెట్‌వర్క్ (ఏపీడీటీఐఎన్) చైర్మన్ శ్రీధర్ కొసరాజు పేర్కొన్నారు. కైట్ కళాశాలలో చదివిన 18 మంది విద్యార్థులకు పలు ప్రముఖ కంపెనీల్లోను, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లోను శిక్షణ పొందిన ధ్రువపత్రాలను శ్రీధర్ శనివారం జరిగిన కార్యక్రమంలో అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని ఏఐ, పరిశోధన వ్యవస్థాపక రంగాల్లో ఈ కళాశాల విద్యార్థులకు రాబోయే రోజుల్లో మరిన్ని అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రిన్సిపాల్స్ రామకృష్ణ, రేవతి, విద్యార్థులు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణం

పిఠాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం అగ్రహారంలోని శ్రీపాదవల్లభ అనఘా దత్త క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. అనంత పద్మనాభస్వామి వ్రతాన్ని నిర్వహించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. టీటీడీ వైఖానస ఆగమ శాస్త్ర వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణ క్రతువు నిర్వహించారు. క్షేత్రంలో చాతుర్మాస్య దీక్షలో ఉన్న మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామి భక్తులకు అనంత పద్మనాభస్వామి వ్రతం, కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణం విశిష్టతలను గురించి వివరించారు. ఆదివారం ఆయన చాతుర్మాస్య వ్రత దీక్షను ముగించి విశాఖ వెళ్లనున్నారు.

ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులకు

నెలకు రూ.20వేలు సాయం అందించాలి

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్



కాకినాడ సిటీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు కారణంగా ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులకు కూటమి ప్రభుత్వం నెలకు రూ.20వేలు సాయం అందించాలని మాలమహానాడు (రాక్స్) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించకుండా ఉచిత బస్‌లు ఇచ్చేస్తే ఏ విధంగా బతుకుతారన్నారు.తాను గతంలో ఆటో యూనియన్‌కు చాలా సంవత్సరాలు గౌరవ అధ్యక్షుడిగా పని చేశానన్నారు. వారి సాధక బాధకాలు, కష్టనష్టాలు తనకు బాగా తెలుసన్నారు. సాయం ఇవ్వని పక్షంలో ఆటో కార్మికులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలుపుతామని రత్నాకర్ హెచ్చరించారు.

ఆదిత్య విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

గండేపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):మండలంలో సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం బీటెక్ మూడో సంవత్సరం విద్యార్థులు విశాఖపట్నంలోని మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ సందర్శించారు. పరిశ్రమలో అనుసరిస్తున్న తాజా సాఫ్ట్‌వేర్ సాంకేతికతలు, ఆధునిక సాధనాలు, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి విధానాలపై అవగాహన పొందారు. అదేవిధంగా ఐటీ సంస్థల సంస్థాగత నిర్మాణం, రియల్ టైమ్ పని విధానాలు, అవసరమైన నైపుణ్యాలు, ఉద్యోగావకాశాలు కెరీర్ అవకాశాలు వంటి అంశాలపై పరిశ్రమ నిపుణులు వివరణ ఇచ్చారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఘనంగా వినాయకుడి నిమజ్జనాలు



వై.రామవరంలో వినాయకుడిని ఊరేగిస్తున్న దృశ్యం

వై.రామవరం, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి):వినాయకుడి నవరాత్రులు ముగింపును పురస్కరించుకుని శనివారం వై.రామవరంలో వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఏఎన్ఎం సబ్ సెంటర్, వాల్మీకి వీధిలోని వినాయకులను ట్రాక్టర్ల పై పలు గ్రామాల మీదుగా ఊరేగించి దేవరమడుగుల పేద్దేరు వాగులో నిమజ్జనం జరిపారు. మహిళలు, యువకులు డీజే డాన్సులతో సందడి చేశారు. మాజీ ఎంపీటీసీ గుడ్ల హేమమని తదితరులు పాల్గొన్నారు..



మోతుగూడెంలో గిరిజనుల సంప్రదాయ నృత్యం

మోతుగూడెం(ఆంధ్రజ్యోతి): శ్రీలక్ష్మి గణపతి ఆలయకమిటీ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రుల వైభవంగా నిర్వహించారు. శనివారం గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తూ గిరిజనులు సాంప్రదాయ నృత్యాలు చేశారు. అనంతరం గణేష్ విగ్రహాన్ని సీలేరునదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అడ్డతీగల(ఆంధ్రజ్యోతి): అడ్డతీగ లక్ష్మీ గణపతి మోటారు యూనియన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రులు పూర్తిచేసుకొని అనంతరం నిమజ్జనం కోసం అడ్డతీగల పురవీధులలో ఊరేగిస్తూ బాణాసంచా కాలుస్తూ గంగవరం మండలం ఏటిపల్లి బ్రిడ్జివరకు ఊరేగించి పెద్దూరులో నిమజ్జనం చేశారు. అదేవిధంగా స్థానిక సోమాలమ్మ ఆలయ ప్రాంగణలో వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

లడ్డూ ప్రసాదం వేలం



వేలంపాటలో లడ్డూని సొంతం చేసుకున్న రామారావు చౌదరి

చింతూరు(ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రమైన చింతూరులో గణపతి నవ రాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈక్రమంలో శనివారం గర్భగుడి లడ్డూ ప్రసాదం వేలం పాట వేశారు. వేలంలో పలువురు భక్తులు పాల్గొనగా చింతూరు టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు ఓబులునేని రామారావు చౌదరి రూ. 65వేలకు లడ్డూను వేలంలో సొంతం చేసుకున్నారు.

కూనవరం(ఆంధ్రజ్యోతి):మండలంలోని టేకుల బోరు గ్రామంలో ఏర్పాటుచేసిన వినాయకుడి మండపంలో వినాయకుడి లడ్డూ పదివేల రూపాయలు పలికింది. ఈ లడ్డూను టేకులబోరు గ్రామానికి చెందిన లంబు శ్రీను వేలంపాటలో దక్కించుకున్నాడు. యాలం రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జనసేన నాయకులు మండల వైస్ ఎంపీపీ బందారు సాంబశివరావు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎం పోస్టులను భర్తీ చేయాలి

దేవీపట్నం, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం డివిజన్ పరిధిలో గల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల పట్ల ఉన్నతస్థాయి అధికారులు బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్నారని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం డివిజన్ పరిధిలో గత సంవత్సరకాలం నుంచి పలు ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలు సంభవించాయని అనారోగ్యానికి గురైన విద్యార్థులకు వైద్యం అందించడంలో అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని ఆశ్రమ పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయన్నారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల మరణాలపై జరిగిన ఘటనలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఆశ్రమ పాఠశాలలో ఇద్దరేసి ఏఎన్ఎం పోస్టులను నియమించాలని ఖాళీగాఉన్న వంట కుక్కు, కమిటీ వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో గేదె, దూడ మృతి

రాజవొమ్మంగి సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి గ్రామంలో విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. రాజవొమ్మంగి గ్రామశివారు ఎస్సీ కాలనీలో శనివారం మేతకు వెళ్లిన ఒక పాడి గేదె, దాని పిల్ల ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న కరెంట్ పోల్ దగ్గర వైర్ తగిలి రెండు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. పశువుల యజమాని బొర్రా అప్పలరాజు కన్నీరుమున్నీరు అయ్యారు. గేదెల విలువ రూ.లక్ష ఉంటుందని వాపోయారు.

అకాల వర్షానికి సేద తీరిన ప్రజలు



అడ్డతీగల, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): గతవారం రోజులుగా ఎండ తాకిడికి అల్లాడుతున్న ప్రజలు శనివారం కురిసిన భారీ వర్షానికి సేద తీరారు. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశంలో కారు మబ్బులు అలుముకొని కుండపోత వర్షం కురవడంతో ప్రజలు సేద తీరారు. ఈ వర్షం కారణంగా గణనాథుల ఊరేగింపులో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

అంగులూరులో సారా బట్టీలపై దాడి

● ఒకరి అరెస్ట్

దేవీపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అంగుళూరు గ్రామంలో సారా బట్టీలపై శనివారం దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ షరీఫ్ తెలిపారు. ఈదాడిలో ఒక వ్యక్తిని అరెస్ట్‌చేసి అతనివద్ద నుంచి 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. దీనిపై కేసు నమోదుచేసి నిందితుడిని కోర్టుకు హాజరపరుస్తున్నట్లు తెలిపారు.

రేపు వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, సెప్టెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ వికాస ఆధ్వర్యంలో సోమ వారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల్లోపు అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ.12వేల నుంచి రూ.20 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజ నం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుంది. ఆసక్తి గల వారు సోమవారం ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరు కావాలి. మరిన్ని వివరాలకు 77993 76222 నెంబరును సంప్రదించాలన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



ప్రత్తిపాడులో నిమజ్జనానికి వెళుతున్న గణనాథులు



ఏలేశ్వరంలో గణేష్ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు



తుని పట్టణంలో గణేష్ శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

కోలాహలంగా గణేష్ నిమజ్జనాలు

● ఆకట్టుకున్న సాంస్కృతిక వేషధారణలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):ప్రత్తిపాడులో శనివారం గణేష్ నిమజ్జనాలు మండలంలో వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని 13 మండపాల్లో 10 రోజులు పాటు పూజలు అందుకున్న గణనాథులను శనివారం గ్రామంలో డీజే సౌండ్‌లు, డప్పుల మధ్య ఊరేగించి పుష్కర, పోలవరం కాలువల్లో నిమజ్జనం చేశారు. ఏలూరు సాక్షి గణపతి ఆలయం వద్ద దాడిశెట్టి స్వామి బృందం గణేష్ లడ్డూను వేలం పాటలో దక్కించుకున్నారు. ప్రత్తిపాడు, ధర్మవ రం, రాచపల్లి, ఒమ్మంగి, ఉత్తరకంచి తదితర గ్రామాల్లో గణేష్ మండపాల వద్ద భారీ అన్నదానాలు నిర్వహించార ప్రత్తిపాడులో పుష్కర కాలువ వంతెన వద్ద నిర్వహించిన గణేష్ వేడుకల్లో ఒక యువకుడు గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు.



ఏలూరులో గణేష్ లడ్డును దక్కించుకున్న భక్తులు



అన్నదానంలో పాల్గొన్న చైర్మన్ రోహిత్, కమిటీసభ్యులు



జగ్గంపేటలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

వేడుకగా రత్నగిరి గణనాథుని నిమజ్జనం

అన్నవరం(ఆంధ్రజ్యోతి): తొమ్మిదిరోజులపాటు పూజలందుకున్న రత్నగిరి గణనాథుడు శనివారం సాయంత్రం గంగమ్మఒడికి చేరాడు. మేళతాళాల ఊరేగింపులు, పండితుల మంత్రోచ్చరణల నడుమ పంపా సరోవరానికి తీసుకుని వచ్చి అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన క్రేన్ సహాయంతో శాస్త్రోక్తంగా నిమజ్జనం గావించారు.రత్నగిరి గణనాధుడితోపాటుగా గ్రామంలో, అన్నవరం పరిసరప్రాంతాల్లో పూజలందుకున్న వివిధ రూపాల గణనాథులను నిమజ్జనం చేశారు. ప్రత్యేక క్రేన్ అందుబాటులో ఉంచి గజఈతగాళ్లను పంపాసరోవరం వద్ద ఏర్పాటుచేశారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న పూజలందుకున్న సుమారు 100 విగ్రహాలను నిమజ్జనం గావించారు. వినాయక నవరాత్రులు పురస్కరించుకుని పలు ప్రదేశాలలో నెలకొల్పిన వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న నల్ల వినాయకుడు గుడివద్ద చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, వైస్ ఎంపీపీ దారా వెంకటరమణ, దేవస్థానం ఏఈవో అనకాపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా ప్రాంతాల్లో గణపతి నవరాత్రులు ముగియడంతో ఏలేరు నదిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. పట్టణంలోని లింగవరం కాలనీ, పెద్దవీధి, తోట వీధి, మార్కెట్, మెక్కారావు కాలనీలలో ఏర్పాటు చేసిన విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి నిమజ్జనం చేశారు. ప్రమాదాలకు తావు లేకుండా పోలీసు సిబ్బందిని, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ రామలింగేశ్వరరావు తెలిపారు.

శంఖవరం(ఆంధ్రజ్యోతి): కత్తిపూడి గ్రామంలోని ఆయా విధుల్లో వినాయకుని నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలను ఊరేగిస్తూ నిమజ్జనం చేశారు.

తునిరూరల్(ఆంధ్రజ్యోతి): తుని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గణేష్ నిమజ్జనాలు కన్నుల పండువగా జరిగాయి. తుని మున్సిపాల్టీ శాఖ ఆధ్వర్యంలో తుని శివారు ఒకటో వార్డులో తాండవ నది తీరాన ఏర్పాటు చేసిన ఘాట్‌లో గణేష్ నిమజ్జనాలను క్రేన్ సహాయంతో చేపట్టారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా తుని పట్టణ, గ్రామీణ పోలీసులు ప్రత్యేక కెమెరాలతో పర్యవేక్షించారు. తునిపట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిమజ్జనాలు ప్రశాంతంగా అయినట్లు తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ తెలిపారు.

గెద్దపేటలో భారీ అన్నదానం

జగ్గంపేట(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలోని గెద్దపేట రామాలయం వద్ద వినాయక చవితి సందర్భంగా నెలకొల్పిన గణనాథుడి మండపంవద్ద శనివారం ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి 3000 మందికిపైగా భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం సాయంత్రం గెద్దపేట, పూలతోట, రాజమ్మ తల్లి గుడి వద్ద గణనాథులను ఊరేగింపుగా యువత నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో సీతారామ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు. స్థానిక పద్మనాభ నగర్ చెరువుగట్టు పైన టీడీపీ బీసీ నాయకులు కుప్ప శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి పురస్కరించుకుని భారీఅన్న సమారాధన నిర్వహించారు. జయ నర్సింగ్ హోమ్ వద్ద గల గణేష్ మండపము వద్ద డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో మహా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జీను మణిబాబు, నియోజవర్గ తెలుగు యువత అధ్యక్షులు దేవరపల్లి మూర్తి హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నండ్ల చిరంజీవి, ఎస్వీఎస్ బాబు, వాకా రెడ్డి, నేదూరి గణేష్, పలివెల ఏసు రాజు, కోడూరి రమేష్, చెలికాని హరిగోపాల్, కేసు బోయిన చిన్ని, అమ్మ స్టిక్కరింగ్ శేఖర్, మారిశెట్టి రాము, సుంకర శ్రీను తదితరులు పాల్గొన్నారు.



జగన్నాథపురం పంచాయతీని పరిశీలిస్తున్న ఎమ్‌పీడీవో వెంకటనారాయణ

సర్వే వివరాలు పరిశీలన

కోటనందూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయా సర్వేలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో వెంకటనారాయణ ఆదేశించారు. శనివారం మండలంలోని జగన్నాథపురం పంచాయతీని తనిఖీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వాట్సాప్ గవర్నెన్స్, కౌశలం, మనమిత్ర సర్వేలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. వీటిని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది సురేష్‌కుమార్, వీరబాబు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నాగచంద్రకు ఎమ్మెల్యే నివాళి

శంఖవరం, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, మండల కార్యదర్శి ఉల్లి వీరభద్రరావు సతీమణి నాగచంద్ర మృతదేహానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ నివాళులర్పించారు. ఇటీవల అగ్ని ప్రమాదానికి గురవగా, కాకినాడ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే కత్తిపూడికి వచ్చి ఆమె మృతదేహానికి నివాళులర్పించారు.

విశ్రాంత ఉద్యోగులకు సత్కారం

ఏలేశ్వరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని విశ్రాంత ఉద్యోగులను వక్తలు సత్కరించారు. శనివారం ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ వీవీ సత్యనారాయణ నేతృత్వంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. విశ్రాంత ఉపాధ్యాయులు ఉద్దగిరి సోమరాజు, ఆస్మోండ్, సత్యనారాయణ, ఏబీవీ ప్రసాద్ శాలువా కప్పి, సత్కరించారు. కౌన్సిలర్ అలమండ చలమయ్య, మాజీ కౌన్సిలర్లు సుంకర రాంబాబు, సామంతుల సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వో సేవలు ప్రశంసనీయం

ఏలేశ్వరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వీఆర్వో కిషోర్ సేవలు ప్రశంసనీయమని సర్పంచ్ బి.వరలక్ష్మి ప్రశంసించారు. శనివారం పేరవరం గ్రామంలో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న వీఆర్వో అవసరాల కిషోర్ దంపతులను సత్కరించారు. మాజీ సర్పంచ్ బి.అరవింద్ కుమార్, టీడీపీ మండల అధ్యక్షులు జ్యోతుల పెదబాబు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతుల నవీన్‌ను కలిసిన రాష్ట్ర డైరెక్టర్ సత్యవేణి

జగ్గంపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట జ్యోతుల నెహ్రూ కాలనీకి చెందిన టీడీపీ పట్టణ మహిళ అధ్యక్షురాలు సత్యవేణి గెద్దాడకు ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. శనివారం ఆమె జగ్గంపేట ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌ను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం నవీన్ ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, రాయి సాయి, మంతెన సంకుబాబు, పోలినాటి ధర్మానందకుమారి శాస్త్రి, ఎల్లాటి అమ్మాజీ, నకిరెడ్డి సూర్యవతి తదితరులు పాల్గొన్నారు.

పేదల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న నవీన్

జగ్గంపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పేదల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని వక్తలన్నారు. వైద్యం చేయించుకోలేని పేదవర్గాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఉపశమనం కలిగిస్తున్నదని జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆసక్తి కనబరుస్తూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేయిస్తున్నారని అన్నారు. శనివారం ఒక్కరోజులోనే 36 మందికి సుమారు రూ.26,08211 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, తోట రవి తదితరులు పాల్గొన్నారు.

మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రచారం

జగ్గంపేట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.శివ ఆధ్వర్యంలో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. జగ్గంపేటలో సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ వర్కర్లు, ఆశ వర్కర్లు, వ్యవసాయ శాఖ సిబ్బంది శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ జగ్గంపేట మండల అధ్యక్షులు జీను మణిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవరపల్లి మూర్తి, సర్పంచ్ బచ్చల నాగ రత్నం, వార్డు సభ్యులు చెలికాని హరిగోపాల్, కోడూరి రమేష్, వైభోగుల కొండబాబు యాదవ్, గండేపల్లి మండల బీసీ సెల్ అధ్యక్షులు కారుకొండ శ్రీనివాస్, శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షులు మోరుకుర్తి రాజు, తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ భవనం పనుల పరిశీలన



అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న జ్యోతుల నవీన్

జగ్గంపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోకవరం రోడ్డులోని జిల్లా పరిషత్ అతిథి గృహం వద్ద నిర్మాణంలో ఉన్న అన్నక్యాంటీన్ నిర్మాణ పనులను జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జగ్గంపేటలో అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. త్వరలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభిస్తారని తెలిపారు. అన్న క్యాంటీన్లు రద్దు చేసినా ఎమ్మెల్యే జ్యోతుల ఆధ్వర్యంలో ప్రతి సోమవారం ఉచితంగా ఆహారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, ఆర్యవైశ్య డైరెక్టర్ కె.బాబు, బి.సత్తిబాబు, అనుకూల శ్రీకాంత్, దేవరపల్లి మూర్తి, రాయి సాయి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అరుణాచల ఆలయంలో ప్రమాణ కార్యక్రమం విరమణ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా శనివారం పోలీసు యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. నర్సాపురం వైసీపీ పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు తండ్రి రామరాజుపై లైంగిక వేధింపుల కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై వైసీపీ, టీడీపీ నాయకులు పరస్పరం అవినీతి ఆరోపణలు, వ్యక్తిగత దూషణలకు దిగారు. శనివారం ఉదయం తాను ఎటువంటి అవినీతి అక్రమాలకు పాల్పడలేదని రాచపల్లి అరుణాచలం ఆలయంలో ప్రమాణం చేయనున్నట్లు వైసీపీ నేత మురళీకృష్ణంరాజు తెలిపారు. దీంతో శాంతి భద్రతలకు దారి తీయవచ్చనే అనుమానంతో స్థానిక ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం ఆయన ఇంటికి వెళ్లి నోటీసు అందజేశారు. వెంటనే ఈ కార్యక్రమాన్ని నిలిపివేయాలన్న నోటీసును ఆయనకు అందజేయడంతో ప్రమాణ కార్యక్రమాన్ని విరమించుకున్నారు.

ప్రత్తిపాడులో కుండపోత వర్షం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలంలో శనివారం రాత్రి కుండ పోత వర్షం కురిసింది. రాత్రి 8 గంటల నుంచి విరామం లేకుండా వర్షం పడుతూనే ఉంది. గత వారం రోజులుగా ఎండలు మండుతుండడంతో ఖరీఫ్ వ్యవసాయ రైతాంగం వర్షాల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో ఈ భారీ వర్షం కురవడం పట్ల మండల రైతన్నలు ఆనందో ఉత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.

వెంకటనగరంలో బీజేపీ నేత చిలుకూరి పర్యటన



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న చిలుకూరి రాంకుమార్

ప్రత్తిపాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటనారాయణ గ్రామంలో శనివారం జిల్లా బీజేపీ పూర్వ అధ్యక్షులు చిలుకూరు రామకుమార్ పర్యటించారు. గ్రామంలో బీజేపీ కార్యకర్త పేకేటి శివ గృహం వర్షాలకు దెబ్బతిని విద్యుత్ వైర్లు మరమ్మతులకు గురికావడం వల్ల శివ కుమార్తె విద్యుత్ షాక్‌కు గురైంది. దీంతో బీజేపీ నేత రామ్ కుమార్ ఆ కుటుంబా న్ని పరామర్శించి తాత్కాలిక విద్యుత్ వైర్ల మరమ్మతులకు రూ.5వేలు సహాయం అందజేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు పూటా వీరబాబు, బాలేపల్లి చక్రి, గోపు అభి, మేడసాని వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

నవగ్రహాలకు అభిషేకాలు



నవగ్రహాలకు అభిషేకాలు చేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లిలోగల అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో నవగ్రహాలకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు రమణనంద స్వామి ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా నవగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు

'ఆత్మగౌరవం చంపుకోలేం'

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వార్డు సచివాలయ ఉద్యోగులతో వలంటరీ విధులు చేయించి ఆత్మ గౌరవం దెబ్బతినేలా చేస్తున్నారంటూ రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య వేదిక పిలుపుమేరకు శనివారం నగర పాలక సంస్థ కార్యాలయంలో వద్ద నిరసన తెలిపి డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌కి వినతిపత్రం అందజేశారు.

నేడు తునిలో జాబ్‌మేళా

తునిరూరల్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): తునిలో నేడు 1500 ఉద్యోగాలకి జాబ్‌మేళా జరగనుంది. తుని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దివ్య ఆధ్వర్యంలో ఇది జరగనున్నాయి. తుని ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణంలో జరిగే ఈ మేళాకి రాష్ట్రంలోని కంపెనీలు హాజరు కానున్నాయి. తుని ఎమ్మెల్యే దివ్య మాట్లాడుతూ ఆది వారం నాడు జరిగే జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.